## క్లుప్తంగా

### రుషి పంచమి వేడుకలు



భట్టిప్రోలు: సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో ఆదివారం రుషి పంచమి వేడుకలను నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్తలు ఏడుగురిని సప్త రుషులుగా భావించి పూజించారు. కార్యక్రమంలో సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ బృందం పర్యటన



భట్టిప్రోలు: రాష్ట్ర యుటీఎఫ్ బృందం వరద ముంపునకు గురైన గ్రామాల్లోని హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలను ఆదివారం సందర్శించింది. పాఠశాలల దీనస్థితిని చూసి బృందం చలించిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసింది.

### ఘనంగా యువజన ఆదివారం



భట్టిప్రోలు: స్థానిక క్రీస్తు లూథరన్ ఆలయంలో క్రిస్టియన్ యూత్ పర్యవేక్షణలో ఈస్ట్ గుంటూరు ఉపాధ్యక్షులు రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ యువజన ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఏఈఎల్‌సీలో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆరాధనలో గాలి ఉదయ్ కుమార్ దైవ సందేశమిచ్చారు. ముఖ్య అతిథిగా గద్దె వెంకట్రావు పాల్గొన్నారు. దేవసహాయం ప్రేమ విందును ఏర్పాటు చేశారు. పల్లెకోనకు చెందిన డాక్టర్ అక్షిత ప్రియ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, సంఘ పెద్దలు ఎల్. శ్రీనివాసరావు, కెవీఆర్‌ఆర్‌వీ ప్రసాద్, బిక్షాలు, జి.నాంచారయ్య, డి.లూథర్‌పాల్, స్త్రీల సమాజం, యూత్, చిల్డ్రన్ సంఘాలు పాల్గొన్నాయి.

### గణేశ్ మట్టి ప్రతిమల పంపిణీ



ఐలవరం(భట్టిప్రోలు): వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం శ్రీదేవి యూత్ దసరా నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఐలవరంలో 1,116 మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి ప్రతిమలను పూజిస్తే పర్యావరణ పరిరక్షణకు పాటుపడినట్టేనని పేర్కొన్నారు.

### పంట నష్టం నమోదు



వేమూరు: వర్షాల వల్ల మునిగిపోయిన పంటల నష్టం వివరాల నమోదులో అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివారం వేమూరు మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి చందోలు సునీత పర్యటించారు. పంట నష్టాల నమోదు చేపట్టారు.

### విష సర్పాల సంచారం




భట్టిప్రోలు: లంక గ్రామాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఆదివారం పెదలంకలో ఐదు అడుగుల తాచు పాము కనిపించడంతో గ్రామస్తులు భీతిల్లారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె రూరల్: తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా నదిలో వరద ఉధృతి మళ్లీ పెరిగిందని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నదిలోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.




రేపల్లెలో వర్తక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం



ఐలవరంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



కర్లపాలెం మండలం ఎంవీరాజుపాలెంలో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



రేపల్లె మార్కెట్ సమీపంలో గణపతికి నగదుతో అలంకారం



భట్టిప్రోలు మండలం జంపనివారిపాలెంలో కొలువైన గణనాథుడు

## గణపతీ నమో..

గణపతి నవరాత్రులు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా చలువ పందిళ్లు వెలిశాయి. వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. కొన్నిచోట్ల ఆదివారం నిమజ్జనోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా లడ్డూల వేలం నిర్వహించారు. చెరుకుపల్లిలో వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ ఈపూరి గణేశ్ వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు.

– భట్టిప్రోలు/రేపల్లె రూరల్/పిట్టలవానిపాలెం/కర్లపాలెం/చెరుకుపల్లి/నగరం



పిట్టలవానిపాలెం మండలం చందోలులో పూజలందుకుంటున్న గణపతి



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నెలకొల్పిన భారీ విఘ్నేశ్వరుని విగ్రహం



చెరుకుపల్లిలో గణపతి పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ ఈపూరి గణేష్



నగరం సంత బజార్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహం

## మహాశక్తిగా బండ్లమ్మ

చందోలులో కొలువైన బండ్లమ్మ వినాయక చవితి రోజున ప్రత్యేక అలంకారంలో కటాక్షించారు. ఆదివారం మహాశక్తిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని తరించారు.

–పిట్టలవానిపాలెం



వినాయక చవితి రోజు ప్రత్యేక అలంకారంలో..



ఆదివారం మహాశక్తిగా..

# వరద మిగిల్చిన విషాదం

లంక గ్రామాలను వరద కకావికలం చేసింది. పేద కుటుంబాలను చిదిమేసింది. తీరని విషాదం నింపింది. ఫలితంగా లంక గ్రామాల్లో వినాయక చవితి శోభ ఎక్కడా కానరాలేదు. పండగ నాడు మట్టి మేటలు వేసిన ఇళ్లు, ఆలయాలు శుభ్రం చేసుకునే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. ఈ గ్రామాల్లో ఎవరిని కదిలించినా.. కన్నీరుమున్నీరవుతున్నారు.



భట్టిప్రోలు మండలం పెసర్లంక హైస్కూల్లో మేట వేసిన ఒండ్రుమట్టి, తగ్గని వరద నీరు



చింతమోటు రామాలయాన్ని శుభ్రం చేసుకుంటున్న ప్రజలు

- లంకల్లో కానరాని వినాయక చవితి శోభ
- కంటతడి పెట్టుకున్న ప్రజలు
- మరోమారు పొంచి ఉన్న ముప్పు
- భారీ వర్షాలతో అలజడి

భట్టిప్రోలు: మళ్లీ లంక గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. భారీ వర్షాలకు ఎగువ నుంచి వరదనీరు దిగువకు వస్తుండడంతో మళ్లీ ముంపు ముప్పు పొంచి ఉందని భయపడుతున్నారు. అధికారులూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముంపు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఇంకా వరద నీరు వీడలేదు. దీంతో ఒండ్రు మేట వేసిన పాఠశాలను శుభ్రం చేసుకునే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. శనివారం పండగ అయినా క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే వరదల వల్ల ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవ శోభ లంకల్లో కానరాలేదు. ప్రజలు ఇళ్లు, ఆలయాలు శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

## చిగురుటాకుల్లా వణుకుతున్న లంకలు

కొల్లూరు : కృష్ణా వరదల బెడద వీడకపోవడంతో కొల్లూరు మండలంలోని లంక గ్రామాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. ఇప్పటికే మునుపెన్నడూ లేని విధంగా వరదలు సంభవించి సృష్టించిన విలయాన్ని మరవక ముందే మరో ముప్పు పొంచి ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని 28 గ్రామాలలోని 6 వేలకుపైగా కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. 8 వేలకుపైగా ఎకరాలలోని పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మళ్లీ వరద పొంచి ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమయ్యారు.



కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

### పండగ చేసుకోలేకపోయాం



నేను పుట్టినప్పటి నుంచి ఇలాంటి వరదను చూడలేదు. సాధారణంగా అప్పుడప్పుడు లంక గ్రామాలకు వరదలు వస్తాయి. ఈమారు కృష్ణమ్మ తీవ్ర ప్రకోపాన్ని చూపింది. లంక గ్రామాలు భీతిల్లిపోయాయి. ఈసారి వినాయక చవితి పండగను జరుపుకోలేకపోయాం. ఇంట్లోని వస్తువులు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఇళ్లను శుభ్రం చేసుకోవడానికే సమయం పడుతుంది.

– ఎస్. పూర్ణ చంద్రరరావు, చింతమోటు, భట్టిప్రోలు మండలం

### 22 ఏళ్ల ఆనవాయితీకి బ్రేక్



ఈ ఏడాది ప్రథమ పూజాధిపతి గణనాథుడికి పూజలు చేసుకునే భాగ్యం కోల్పోయాం. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. 22 ఏళ్లుగా మా గొడ కాలనీలో బొమ్మ పెట్టి నవరాత్రులు జరుపుకునేవాళ్లం. ప్రస్తుతం రామాలయాన్ని రెండు రోజులుగా శుభ్రం చేస్తున్నాం.

– సాయి, ఆదిత్య, చింతమోటు, భట్టిప్రోలు మండలం

# నీటి ముంపులోనే పొలాలు

చెరుకుపల్లి: మండలంలోని కనగాల, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి, గుళ్ళపల్లి గ్రామాల్లో లోతట్టు పొలాలు వారం రోజుల నుంచి నీటి ముంపులోనే ఉన్నాయి. మండలంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా వరిపైరు మునిగిపోయి కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడింపల్లి చానల్ కాలువ పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కట్టపై నుంచి పొంగి పొన్నపల్లి గ్రామంలోని 216ఏ జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలనీలోకి వచ్చిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కాలువలో వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు.



పొన్నపల్లి కాలనీలో చేరిన వరద నీటిలో ప్రజల అవస్థలు



పిచ్చిమొక్కలతో నిండిపోయిన నడింపల్లి చానల్



గుళ్లపల్లి పొలాల్లో పెరుగుతున్న వరద నీరు

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి అర్బన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంలోనూ స్థానిక శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యుల సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం 60 ఏళ్ల గుర్తు తెలియని మృతదేహానికి సమితి సభ్యులు తెనాలిలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన 65 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో తెనాలి జిల్లావైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతనికి ఎవరు లేకపోవడంతో కొల్లూరు పోలీసులు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందసేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు ఫోన్ చేసి దహన సంస్కారాలు నిర్వహించాలని కోరారు. దీంతో ఆయన సభ్యులతో కలసి జిల్లా వైద్యశాలలోని మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో తరలించారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రకాష్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# వెల్లువలా సాయం



పిట్టలవానిపాలెం చందోలు నుంచి ఆహారం తీసుకెళ్తున్న దృశ్యం



వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న భట్టిప్రోలు ఫాదర్లు

పిట్టలవానిపాలెం/భట్టిప్రోలు/రేపల్లె రూరల్/కర్లపాలెం/వేమూరు/కొల్లూరు: వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు బాసటగా నిలుస్తున్నాయి. దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన ఎమ్మార్పీసీటీ నిర్వాహకులు, పాస్టర్ పల్లికొండ రత్నం అండ్ బ్రదర్స్ ఆదివారం తిప్పలకట్టలో 500 మందికి దుప్పట్లు, మహిళలకు 300 చీరలు పంపిణీ చేశారు.

- బెంగుళూరు సెయింట్ క్లారెట్ మిషనరీ ఫాదర్స్ జాన్, జార్జ్ సిబిల సహకారంతో ఆదివారం ఓలేరు, జువ్వలపాలెం గ్రామాల్లోని 750 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భట్టిప్రోలు ఆర్‌సీఎం చర్చి విచారణ ఫాదర్లు రవి, మార్టిన్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.
- సత్యసాయి సేవా సంస్థలు–బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో తురకపాలెంలోని 120 వరద బాధిత కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కూరగాయలు, బియ్యం కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- రేపల్లె మండలం బొబ్బర్లంక పంచాయతీలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కాళ్ళేపల్లి ఈశ్వరబాబు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుప్పట్ల పంపిణీ ఆదివారం జరిగింది.
- కర్లపాలెం మండల సమాఖ్య, బ్యాంకర్లు కలిసి లంక గ్రామాల్లోని బాధితుల కోసం సేకరించిన బియ్యం వాహనాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు.
- విజయవాడ వరద బాధితులకు కర్లపాలెం మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాష ఆధ్వర్యంలో ముస్లింలు భోజన పదార్థాలు తీసుకెళ్లారు.
- వేమూరు మండలం పోతార్లంక, గాజులంక గ్రామాల్లో ఆదివారం ఏపీఎస్ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్స్‌లు బిస్కెట్లు, పలకలు పంపిణీ చేశారు.
- తెనాలికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొల్లూరు మండలంలోని ఆవులవారిపాలెంలో 450 కుటుంబాలకు 13 రకాల నిత్యావసర సరకుల పంపిణీ చేశారు.
- పిట్టలవానిపాలెం మండలం చందోలు నుంచి విజయవాడ వరద బాధితులకు టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు మోసిన్ నియాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఆహారం, పండ్లు, మంచినీటి బాటిళ్లను తీసుకెళ్లారు.




తిప్పలకట్టలో చీరలు, దుప్పట్ల పంపిణీ



తురకపాలెంలో నిత్యావసరాలు పంపిణీ



బొబ్బర్లంకలో నిత్యావసర వస్తువులు, దుప్పట్ల పంపిణీ



కర్లపాలెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడకు సాయం



పోతార్లంక గ్రామంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో..